# రిటైరయ్యాక...

పి.రామకృష్ణ



"రిటైరయ్యారటగా..."ఏదో ఆలోచించుకుంటూ నడుస్తున్న నాకు ఎదురుగ్గా ఎప్పుడొచ్చాడో వెంకట్రామయ్య గమనించలేదు. చూసేసరికి, ఆ ప్రశ్నను సూటిగా నా ముఖం మీద వదిలేసి చూస్తున్నాడు.

"అవును..."అన్నాను, కొద్దిగా నవ్వుతూ. ఒక్కసారి ఆయన నన్ను కిందినుంచీ పైదాకా చూసినట్టనిపించింది. ఆ చూడ్డంలో నా చేతిలోవున్న కూరగాయలసంచిని కొంచెం ప్రత్యేకంగా చూసినట్టు...అనుమానం.

"ఇంకేం చేస్తావ్‌లే, బజారుకెళ్ళి కూరగాయలు తేవడమూ, పచారీకొట్టు కెళ్ళి సరుకులు తేవడమూ..." అని నవ్వుకుంటున్నాడా? నవ్వుతున్నాడో, లేదో చూద్దామనుకున్నాను కానీ, నవ్వుతూ వుంటే...అనుకుని మానుకున్నాను.

"హూ...(ఇప్పుడు నవ్వేసాడు) ఏంచేద్దామనుకుంటున్నారు? ఏదైనా ప్లానుందా?"

"ప్రత్యేకంగా ప్లానంటూ ఏంలేదు" అని గొణిగాను.

"రిటైరయ్యాక ఏం చేస్తార్లెండి. అయినా మీకేం బాదరబందీల్లేవుగా. పిల్లలు ఎవరిపాటికి వాళ్ళు సెటిలయ్యారు. హాయిగా వేళకింత తిని విశ్రాంతి తీసుకోండి" అని ముందుకెళ్ళిపోయాడు వెంకట్రామయ్య. "నయం...వేళకింతతిని (ఎంత తినాలో చెప్పలేదెంచేతో!) కృష్ణా!రామా! అంటూ పడుకోండి" అనలేదు...అనుకుంటూ వెంకట్రామయ్య వెళ్ళిన వైపు చూసాను. ఆ పాటికి ఆయన కనుమరుగైపోయాడు కానీ, ఆయన వేసిన ప్రశ్నా, ఇచ్చిన సలహా మరుగైపోలేదు. నాకేదైనా ప్లానుందేమో తెలుసుకోవాలని ఆసక్తి చూపిన మనిషి, ఆ మరుక్షణమే "ఏం చేస్తార్లెండి" అనడమేమిటి? "రిటైరయ్యాక ఏం చేస్తార్లెండి" అన్నాడనుకో. రిటైరయ్యాక నేనేం చేయదల్చుకున్నానన్నదే కదా, ఆయన తెలుసుకోవాలనుకున్నది. "పిల్లలు ఎవరిపాటికి వాళ్ళు సెటిలయ్యారు" అంటే, పిల్లల్ని మెచ్చుకుంటున్నట్టేనా? "నీ పాటికి నువ్వేమీ వాళ్ళకు సహాయం చెయ్యకపోయినా" అని నన్ను ఆక్షేపిస్తున్నట్టా?

ఈ సందర్భం సరిగ్గా నా చిన్నప్పటి సందర్భాన్నొకదాన్ని జ్ఞాపకం చేసింది. చిన్నప్పటి సందర్భాల గురించి చెప్పాలనేది పెద్దవాళ్ళకుండే అసందర్భపు ఆసక్తిలెమ్మని కొట్టేయకుండా, కొంచెం ఓపికతో వినవలసిందిగా విజ్ఞప్తి.

మా ఊళ్ళో మాతాతగారు ప్రతి వేసవిలో పెద్ద ఎత్తున కోడిపందాలు జరిపించేవారు. చుట్టుపక్కల ఊళ్ళవాళ్ళంతా వచ్చి, మా తాతగారి మామిడి చెట్లెక్కి ఆడుకోవడానికి, నేనూ మా అక్కా అప్పుడప్పుడూ వెళ్ళేవాళ్ళం. ఒకసారి మా తాతగారి కోడి గెల్చింది. ఓడిన కోడి చావలేదు, పందెంలో పారిపోయింది. చెవులకు లోలాకుల్తో, కాళ్ళకు పట్టీలతో ఆ పారిపోయిన కోడి భలే అందంగా వుండింది. అవతలి కోడితో మరి తన్నుకుంటే తన షోకు పాడవుతుందని అదిపారిపోయిందేమో! దాని గాయాలు మాన్పించి పెంచుకుందామని బ్రతిమాలి, మా తాతగార్ని వప్పించాము. ఆయన పందెగాన్ని పిలిపించి, దాని గాయాలు మాన్పేసి, పట్టుకరమ్మని చెప్పారు. గాయాలను పరిశీలించిన పందెగాడు పెద్దగాయాలేం కాదనీ, పదిరోజుల్లో బాగవుతాయనీ చెప్పి, కోడిని చంకకెత్తుకున్నాడు. ఎవరు చెప్పారో జ్ఞాపకం లేదు కానీ, అది ఓడిన కోడి అని వింటూనే, చంకనున్న కోడిని చటుక్కున దించేసి, "అయితే గాయాలు మానవు" అంటూ ఇంకో మాట లేకుండా వెళ్ళిపోయాడు.

పెద్దగాయాలు కావనీ. పదిరోజుల్లో బాగవుతాయనీ చెప్పిన మనిషి అంతలోనే "గాయాలు మానవు" అని చెప్పి వెళ్ళిపోవడం మా అక్కకూ, నాకూ ఆశ్చర్యం కలిగించింది. ఆ పందెగాడికి పిచ్చో, పొగరో వున్నట్టు తిట్టేసాము. మా తాతగారు నవ్వేసారు. అతనికి పిచ్చికానీ, పొగరు కానీ లేదట. గొప్ప పందెగాడట. అతనలా చెబుతాడని, మా తాతగారికీ తెలుసట. కాకపోతే, తనే మమ్మల్ని నిరాశపరచడం ఇష్టం లేక, పందెగాడి ద్వారా చెప్పించాడట. కోడిమాంసం తినడం కోసం మా తాతగారు యీ కుట్ర పన్నినట్టు, మాకు అనుమానమేసింది. ఆయన బిగ్గరగా నవ్వి, "లేదర్రా! కోడిమాంసం కావాలనుకుంటే ఆ కోడే కావాలా నాకు! ఊళ్ళో కోళ్ళక్కరువా!" అని, ఇద్దర్నీ దగ్గరకు తీసుకున్నాడు. ఆ తర్వాత చెప్పారు. పందెంలో గెల్చిన కోడికి పెద్ద గాయాలు తగిలినా బాగవుతాయట. ఓడిన కోడికి (దాన్ని 'కోసుకోడి' అంటారట) చిన్న దెబ్బలు తగిలినా ఒక పట్టాన బాగవదట. గెల్చిన కోడికి దాని విజయోత్సాహం గాయాలను మాన్పడంలో తోడ్పడితే, ఓడిన కోడిని దాని పరాభవమే ప్రాణాంతకమవుతుందట.

ఇదంతా ఎందుకు చెప్పానో వివరిస్తాను. ఇంతకు ముందు వెంకట్రామయ్య "ఏం చేయాలనుకుంటున్నారు?" అనడిగి, ఆ వెంటనే "రిటైరయ్యాక ఏం చేస్తార్లెండి" అనడం చూస్తూనే, ఆ పందెగాడూ, కోసుకోడి కథ జ్ఞాపకమొచ్చింది. అంటే, వెంకట్రామయ్య దృష్టిలో రిటైరైన నేను కోసుకోడినయ్యానా! ఆ మాట కొస్తే, వెంకట్రామయ్య కూడా కోసుకోడే కదా! ఆయన పాత కోసుకోడైతే, నేను కొత్త కోసుకోడిని. లేక, ఆ అనుభవంతోనే ఆయన "రిటైరయ్యాక ఏం చేస్తార్లెండి" అని వుంటాడా? అందులో వున్నది సానుభూతేనా? వెటకారం కూడా వుందా? వెంకట్రామయ్యకే కాదు, చాలామందికి రిటైరయినవాళ్ళు ఏమీ చెయ్యలేరు... అన్న నమ్మకమేదో వున్నట్టుంది. అప్పుడప్పుడూ పత్రికల్లో, రిటైరయినతర్వాత కూడా ఏవో సాధించినవాళ్ళ కథలొస్తుంటాయి. అట్లాంటి ప్రత్యేక వ్యక్తుల సంగతికాదు, మామూలు మనుషుల సంగతి మాట్లాడుతున్నది. ఆ "ఏమీ చెయ్యలేరు" అన్న నమ్మకం నుంచీ (పాపం...లంచాలు కూడా తీసుకోలేరు) వాళ్ళమీద సానుభూతి పుట్టుకొస్తుందా?

"అధికారాంతమునందు చూడవలెరా ఆ అయ్య సౌభాగ్యముల్" అన్నాడట వొకాయన. అధికారం 'వెలగబెట్టిన' వాళ్ళను గురించి అలా అనుకునే వాళ్ళు చాలామందే వుంటారు. అందులో ప్రతీకారాసక్తి వున్నట్టుంది. ఆ అధికారి అక్రమాలకు ఆగ్రహించిన వాళ్ళూ అలాకోరుకోవచ్చు. ఏదో ఆశించి, ఆ అధికారినుంచీ అది నెరవేరక ఆక్రోశంతో వున్న వాళ్ళూ అలా కోరుకోవచ్చు. మొత్తం మీద అందులో 'అలా జరగా'లన్న కోరికే తప్ప, 'అలా జరగరాద'న్నదే మాత్రం లేదని చెప్పవచ్చు.

'అధికారబలం' అంతరించి, మనలాగే మామూలు మనిషి కాకపోతాడా, మనం చూడకపోతామా...అన్న బలహీనుల బలమైన కోర్కె అది. అధికారం వేరూ, ఉద్యోగం వేరూ కాబట్టి "ఉద్యోగాంతము నందు చూడవలె..."అన్న ఉత్సుకత వుండదు. రెండో సందర్భంలో సానుభూతికి తప్ప కసికి చోటులేదు. అయినా, కసి కన్నా, సానుభూతే ఎక్కువ ఇబ్బందులు కల్గించడం విచిత్రమూ, విషాదకరమూ. "సానుభూతి వల్ల ఎట్లా ఇబ్బందులొస్తాయి" అని సందేహిస్తున్నారా? ఇప్పుడు మీకు కోటేశ్వరరావును గురించి చెప్పాలన్నమాట. వుండండి. ఈ రద్దీ రోడ్డు మీద నడుస్తూ, కూరగాయల సంచిని మోస్తూ, ఆయన్ని గురించి చెప్పడం సాధ్యం కాదు కనుక, ఇంటికెళ్ళి ఆ తర్వాత...

* * *

కోటేశ్వరరావులు కోటిమంది వుండొచ్చుకానీ, యీ కోటేశ్వరరావు మాత్రం కోటిమందిలో ఒకరు కారు. రిటైరైన ఉద్యోగుల్లో ఒకడు కానీ, ఆయన్లో రిటైరైన లక్షణాలేమీ కనిపించవు. రిటైరయిన స్నేహితుల్ని పట్టుకొని...గిరీశం వెంకటేశంని పలకరించినట్టు "అదేంటోయ్! రిటైరైన మొహం వేసుకున్నావ్!" అని పలకరిస్తుంటాడు. రిటైరయిన మొహం కనిపిస్తే ఆయనకు మహామంట. "ఫలానా ఆయన రిటైరయ్యారు పాపం..."లాంటి మాట వినిపిస్తే ఆయనకు కోపమొచ్చేస్తాది. ఆ 'పాపం' అనే సానుభూతి, ఆ తర్వాతి పరిణామాలను గురించి, వినేవాళ్ళుండాలి కానీ చాలా వివరంగా చెబుతాడు కోటేశ్వరరావు. రిటైరయిన ఉద్యోగుల నిర్జీవితాలపై ఆయన రాయనున్న గ్రంథంలో 'రిటైరయిన ఉద్యోగులు - ఆయా దశలు' అనేది ఒక భాగమట. అందులో 'రిటైరయ్యారు పాపం'ది ప్రథమదశ.

ఆ దశలో రిటైరయిన ఉద్యోగి, ఉద్యోగం కట్టిన గుడ్డలా కొంచెం వాసనలు వీస్తూ వుంటాడు. ఇంగువ కట్టిన గుడ్డ చాలాకాలం వాసనలీనుతూవుండవచ్చుకానీ, రిటైరయిన ఉద్యోగినుంచీ ఉద్యోగపు వాసనలు చాలాకాలం వెలువడవు. అప్పుడు రెండో దశ ప్రారంభం. ఆ దశలో కొడుకునుంచో, కూతురునుంచో, కోడలినుంచో సనసన్నని సూచనలొస్తాయి. "ఇంట్లోనే వుంటున్నారుగా ఇప్పుడు. పిల్లల్ని స్కూలుకు తీసుకెళ్ళి తీసుకురావడమో, వాళ్ళ హోంవర్క్ కాస్త చూడ్డమో, సాయంత్రాల వాళ్ళని అలా బైటికి తీసుకెళ్ళడమో చేస్తుండొచ్చుగా. ఆయనకీ కాస్త కాలక్షేపమైనట్టుంటుంది" అని, ఆయన కాలక్షేపం గురించి ఆలోచిస్తున్నట్టుగా ఆ సూచనలు ప్రారంభమై, చూస్తుండగానే బలపడి ఆదేశాలవుతాయి. ఆ ఆదేశాల్ని

**మూడోదశ 'ముసలాయన'దశ. 'పెద్దాయన' అని కూడా అనవచ్చునుకో, రెండింటికీ పెద్ద తేడా ఏం లేదు. ఆ దశలో, రిటైరయిన వ్యక్తి భార్య కూడా 'ముసలాయన' అని సంకేతిస్తూ వుంటుంది. మర్యాదకి, మన సంస్కారం అంతటిదని చాటుకోడానికి, "ఫలానా ఆయన రిటైరై ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు" అంటాం.**

పాటించకపోతే అంతర్యుద్ధాలు ప్రారంభమవుతాయి. ఇప్పుడు మనకు పార్కులో పిల్లల్ని ఆడించుకుంటూ కనిపించేవాళ్ళూ, పిల్లల్ని స్కూలుకు తీసుకెళ్ళేవాళ్ళు ఆ దశలోకి వచ్చినవాళ్ళు.

మూడోదశ 'ముసలాయన'దశ. 'పెద్దాయన' అని కూడా అనవచ్చునుకో, రెండింటికీ పెద్ద తేడా ఏం లేదు. ఆ దశలో, రిటైరయిన వ్యక్తి భార్య కూడా 'ముసలాయన' అని సంకేతిస్తూ వుంటుంది. మర్యాదకి, మన సంస్కారం అంతటిదని చాటుకోడానికి, "ఫలానా ఆయన రిటైరై ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు" అంటాం. సారాంశమేమిటంటే... "రిటైరై పనీపాటా లేకుండా వుంటున్నాడు" అనే. ఆ దశలో ఆయన పూర్తిగా అదనపు మనిషి. ఇంక ఆయన రిటైర్మెంట్ తాలూకు పైసలేమైనా వుంటే, అదో యుద్ధం. అయితే, మనం ఆ ఆర్థిక సమస్యలలోకి వెళ్ళడం లేదు. కేవలం రిటైరైన వాళ్ళ మానసిక పరిస్థితి-ప్రభావాల గురించే మాట్లాడుతున్నది. ఇలా సాగుతుంది కోటేశ్వరరావు కథనం.

"రిటైరయినట్టు తెలుస్తూనే నీ మానసిక పరిస్థితి ఎలా వుండింది?" అనడిగాను. మంచి ప్రశ్న వేసినట్టు కోటేశ్వరరావు చిరునవ్వుతో నా మొహం చూసాడు. ఒక్క నిమిషం వూరుకుని, నెమ్మదిగా ప్రారంభించాడు, "ఎప్పుడు రిటైరవుతానా అని నేను భీష్ముడు స్వచ్ఛందమరణాన్ని కోరినట్టు ఉద్యోగం అంపశయ్య మీది నుంచీ కోరుతూ వచ్చిన సంగతి. అయినా, 'మీరు ఫలానా అప్పుడు రిటైరవనున్నారు' అని మా ఆఫీసువాడు చెప్పినప్పుడు, నా మొహం తెల్లబడిపోయింది. నా మొహం తెల్లబడినట్టు నాకే ఎట్లా తెలిసిందంటే, ఆఫీసు వాడి ముఖం



చూస్తే తెలిసింది. ఆ సంగతి చెబుతూనే, ఎదురుగ్గా వున్న ఏ రంగు మొహమైనా తెల్లబడితీరుతుందన్న ఆఫీసువాడి అనుభవజ్ఞానం అందులో కనిపించింది."

"అదేమిటి? రిటైరవాలని కోరుకున్నారుగా..."అన్నాను అమాయకంగా.

"అదేమిటీ అంటే ఏం చెబుతాం! మన మొహాలైతే మాత్రం మనం చెప్పినట్టూ వింటాయా? క్షుద్ర ఉద్యోగాలకి క్షుద్రశక్తులుంటాయి. అవి మన మొహాన్ని మన పర్మిషన్ లేకుండానే తెల్లబడేట్టు చేస్తాయ్" టపాకాయలు పేల్చినట్టు నవ్వాడు. నాకూ నవ్వొచ్చింది.

"ఆర్థికసమస్యలు లేని వాళ్ళ సంగతి కదా మనం మాట్లాడుతున్నది. భార్యా, తనూ ఇద్దరే వున్నప్పుడు, ఇంతకు ముందు నువు చెప్పిన సమస్యలు వచ్చే అవకాశాలు లేవు కదా"

"అర్థమైంది. నీ సంగతి గురించి అడుగుతున్నావన్నమాట. నీ సంగతి చెప్పడానికైనా, నా సంగతి నుంచే చెప్పాలి తప్ప ఇంకోగతిలేదు కనుక, విను. ఆఫీసువాడి ముందు తెల్లబడిన నామొహం కాసేపటికి క్షుద్రశక్తి నుంచీ విముక్తి చెంది, నా అసలు చామనచాయలోకి వచ్చింది. నాది చామన చాయ కాదనీ, నలుపనీ నా భార్య వాదిస్తుందనుకో. అదట్లా వుండనీ, ఇంటి కొచ్చి యీ వార్త ఆమెకు చెప్పాను. ఆమె దిగ్భ్రాంతితో నా మొహం చూసింది. రాజకీయనాయకులూ, ఇతరప్రముఖులూ అప్పుడప్పుడూ దేనికోదానికి 'దిగ్భ్రాంతి'ని వ్యక్తం చేస్తుంటారు. అది అలవాటైనదే తప్ప అసలుది కాదు. అసలు 'దిగ్భ్రాంతి' మా ఆవిడది. ఆమె క్షుద్ర ఉద్యోగమేదీ చేయడం లేదు. ఆమె మీద నా మీద కంటే ఎక్కువగా క్షుద్రశక్తి ఎట్టా ప్రభావం చూపిందా అని నా క్కొంచెం దిగ్భ్రాంతి కలిగింది. రిటైరయినందుకు లోలోపల సంతోషిస్తున్నట్టు ఆమె నిర్ధారణకు వచ్చి, అందుకు నన్ను శిక్షించాలని నిశ్చయించుకుంది"

→

"అన్యాయం, ఆమె నిన్నెట్లా శిక్షిస్తుంది?"

"ఎట్లా శిక్షించగలిగిందో చెబుతా విను. భర్తలకుండే ఏ అవకాశాలూ భార్యలకు లేనప్పుడు, భార్యభర్తనెట్లా శిక్షిస్తుందీ అన్నది నీ ప్రశ్న. వెనుకబడినవాళ్ళకు వెనుకబాటుతనమే ఆయుధమవుతుందని, ఇన్ని ఉద్యమాలూ, పోరాటాలూ చూసినా నీకు తెలీలేదంటే నేనేం చేసేది? 'నీకేం నువు హాయిగా రిటైరయ్యానంటూ, ఇంట్లో కూచుంటున్నావు. నా చాకిరీ ఇంకా పెరిగింది. నాకు రిటైర్మెంట్ లేదా?' అని సాధించడం మొదలయింది"

"సాధించడమేముంది? ఆమె అడుగుతున్న దాంట్లో న్యాయముందికదా"

"నేను ఉద్యోగం చేసిన కాలమంతా పొద్దున్నే పేపర్ చదువుతున్నప్పుడు కాఫీ ఇచ్చి, షేవ్ చేసుకుని స్నానానికి వెళ్ళేముందు 'టీ' ఇచ్చి, ఆ తర్వాత భోజనం పెట్టి, 'లంచ్'మేయడానికి బాక్సు సర్ది, ఆఫీసును సేవించి, ఇంటిని పాలించడానికి సాయంత్రం తిరిగివచ్చేసరికి మళ్ళీ ఏదో చేసి...యీ పనులన్నీ చేసినప్పుడు 'చాకిరీ'గా ఎందుకు కనిపించలేదు? ఇప్పుడు మాత్రమే చాకిరీగా ఎందుకు కనిపిస్తోంది? ఎందుకంటే, అప్పుడు ఉద్యోగం చేస్తున్న మొగుడూ, ఇప్పుడు రిటైరైన మొగుడూ. అంతేనా?" కొంచెం సేపు మాట్లాడలేకపోయాను.

"ఆమె వైపు నుంచీ ఆలోచించాలికదా! నువు ఉద్యోగం చేస్తున్నప్పుడు ఆఫీసులో వున్నప్పుడైనా ఆమెకు విశ్రాంతి వుండివుంటుంది. ఇప్పుడదీ వుండకపోగా, పని పెరిగిందన్నదీ నిజమే అయి వుంటుంది. సాధిస్తున్నట్టు ఆరోపించడం కన్నా పనిలో సహాయపడవచ్చుగా"

"ఆ ప్రయత్నమూ అయింది. నా బట్టలు నేనే ఉతుక్కుందామని బకెట్లో వేసుకుని పంపు దగ్గరికొచ్చాను. గబగబా వచ్చి లాక్కుని వెళ్ళిపోయింది. రిటైరైన మనిషితో పనిచేయిస్తోందని తనని అందరూ తిడతారట. అప్పటికే పక్కింటావిడ చూస్తోందట! మొదట్నించీ నా పనులు నేను చేసుకుంటూ వుండి వుంటే బావుండేదట. ఈ వయస్సులో చేస్తే, తను చేయిస్తున్నట్టే అనుకుంటారట"

"ఆమె అలా అనాలనే నువ్వు కోరుకుని వుంటావు."

"అంటే, నేను ఆమెకు పనిలో తోడ్పడాలనుకోవడాన్ని నువ్వు నమ్మడం లేదన్నమాట. దీన్నిబట్టి చూస్తే, మనుషులు పరిస్థితిని బట్టి మారతారనే సూత్రం మీద నీకు నమ్మకం లేనట్టు తెలుస్తోంది"

"కార్మికుల కృతజ్ఞతని యాజమాన్యులు ఉపయోగించుకున్నట్టే ఆడవాళ్ళ అమాయకత్వాన్ని మగవాళ్ళు ఉపయోగించుకుంటారు...." అందామనుకున్నాను.

"సరే, నేను దొంగనే అనుకుందాం. మనం చర్చిస్తున్నది ఆడ, మగ శ్రమ విభజన గురించి కాదు. రిటైరయిన వాళ్ళ పరిస్థితి గురించి, రైటేనా?"

"నిజమేననుకో. ఇంటిపనిలో ఇద్దరి భాగస్వామ్యం వుంటే, రిటైరయినా భర్త భార్యకెందుకు భారమవుతాడు?"

"భారమవుతాడా, కాడా అనేది కాదు ప్రశ్న. రిటైరైన వ్యక్తి భార్య దృష్టిలో కూడా ముసలాడవుతాడా కాడా అనేది. ఇంకో సున్నితమైన విషయం చెప్పకూడదనుకున్నాను. చెప్పకపోతే, నీకు సరిగా అర్థమయ్యేట్టులేదు"

"ఏమిటది?" అనడిగాను. కోటేశ్వరరావు కొంచెం ఆగి, ప్రారంభించాడు.

"భార్యాభర్త ఇద్దరే వున్న కుటుంబం గురించి కదా మాట్లాడుతున్నది"

"అవును" అన్నట్టు తలూపాను.


"ఆ భార్యాభర్తల పిల్లలందరూ జీవితం కెరటాల మీద ఎక్కడెక్కడికో కొట్టుకొని వెళ్ళారనుకుందాం. వున్నది రిటైరైన భర్తా, రిటైర్‌కాని భార్య. రిటైరయిన వాళ్ళు జవసత్వాలుడిగిన వృద్ధులు కారు. పత్రికల వాళ్ళయితే, యాభైఏళ్ళవాళ్ళని కూడా వృద్ధులని రాస్తుంటారు కానీ, పెరిగిన ఆయుఃప్రమాణం మేరకు యాభైఏళ్ళవాళ్ళు మధ్యవయస్కులు. ఏదో సమయంలో రిటైరైన భర్త, తను రిటైరైనా రిటైర్ కాని కోర్కెతో భార్యను దగ్గరికి తీసుకోవాలనో, తను భార్య దగ్గరికి చేరాలనో...అనుకుంటే... "సిగ్గులేదూ! మనవలూ మనవరాళ్ళూ వచ్చారు. రిటైరయ్యావు, అవున్లే ఇంకేం పనిలేదుగా. ఇంకనన్నా ఇలాంటివన్నీ మానుకుని వండిపెట్టింది తిని వుండొచ్చుగా" అంటే ఎలా వుంటుంది? తను పాపాత్ముడైనట్టు ఎంతటి పాపాత్ముడైనా సిగ్గుపడవలసిందే. మనవలూ మనవరాళ్ళూ తనని వింతగా చూస్తున్నట్టు ఫీలవ్వాల్సిందే. ఆ తర్వాత నిజంగానే జవసత్వాలుడిగిన వృద్ధుడై, వండిపెడితే తిని పడివుండే స్థాయికి పడిపోతాడు"

"దారుణంగా వుంది. భర్త రిటైరయినందుకు శిక్షగా ఆమె అలా అని వుంటుందా?"

"కాకపోవచ్చు. ఆమె శారీరకమానసికపరిస్థితులు అందుకు కారణమై వుండవచ్చు. భర్త రిటైర్మెంట్‌ని వృద్ధాప్యానికి గుర్తుగా ఆమె భావించిందన్నదే పాయింట్"

"స్వీయానుభవమా?" అడిగాక, మర్యాదకాదనిపించింది.

"స్వీయానుభవమేనంటే కానీ నమ్మవా? ఇంతకు ముందు స్వీయానుభవం చెప్పినా నమ్మలేదుగా. ఇంతకూ ఇలా చెబుతూంటే, నా భార్యకానీ, ఈ భర్త భార్యకానీ సరైన వాళ్ళు కాదని చెబుతున్నట్టు అనుకోకు. వాళ్ళదేమీ తప్పులేదు, రిటైరయినవాళ్ళు వృద్ధులుగా వుండిపోవడం తప్ప ఇంకేమీ చెయ్యలేరు అన్న భావంలో వుంది తప్పంతా"



**"కార్మికుల కృతజ్ఞతని యాజమాన్యులు ఉపయోగించుకున్నట్టే ఆడవాళ్ళ అమాయకత్వాన్ని మగవాళ్ళు ఉపయోగించుకుంటారు...."**

"ఈ భావం పుట్టి స్థిరపడడానికి ఎవరు కారణమంటావ్?"

"అందరికీ పనిచూపించలేని ప్రభుత్వాలు కారణం. నిజానికి, ఇంకా ఉద్యోగం చెయ్యాలా, అక్కర్లేదా అన్నది ఆయా వ్యక్తులు నిర్ణయించుకోవాలి. పెరుగుతున్న నిరుద్యోగులకు ఏదో ఆశ చూపించడానికి ఉద్యోగం చేస్తున్న వాళ్ళకి రిటైర్మెంట్ వయస్సనేది ఒకటి చూపించి, ఆ వయస్సు వచ్చిన తర్వాత వాళ్ళు పనిచేయలేరన్న భావాన్ని వ్యాప్తి చేసి....ఆడుతున్న నాటకం. వ్యవసాయదారులూ, ఇతర శ్రమజీవులూ ఎనభై ఏళ్ళ వయస్సులో కూడా శ్రమిస్తూనే వున్నారు. మరి, వాళ్ళకు అక్కర్లేదా 'విశ్రాంతి'? వాస్తవానికి శారీరకశ్రమచేసిన వాళ్ళకే విశ్రాంతి ఎక్కువ అవసరం. నా గ్రంథం నాలుగో అధ్యాయంలో ఈ విషయం సుదీర్ఘంగా చర్చించాను"

రిటైర్మెంట్ లేని వాళ్ళు ఎందరో వున్నారన్న సంగతి, నా కిప్పుడు తెలిసినట్టుంది!

"ఉద్యోగమంటే ఆఫీసులకు వెళ్ళి, జీతాలు తెచ్చుకోవడమేనన్న నమ్మకం జీవితాలను పాడు చేస్తోంది. కోతి పామును పట్టుకొన్నట్టు...అనే మాటని ఎప్పుడైనా విన్నావా?" అనడిగాడు కోటేశ్వరరావు.

"విన్లేదు" అన్నాను.

"అయితే, విను. కోతి పామును పట్టుకుంటే, పాము చచ్చి కుళ్ళిపోయినా వదల్దట. వదిల్తే కాటు వేసి చంపుతుందన్న భయంతో, పడగ దగ్గర పాము గొంతును బిగించిపట్టుకున్న పిడికిలితో అలాగే వుంటుందట. కొమ్మమీద కూచున్నా పామును కిందికి వేలాడదీసి అలాగే వుంటుందట. పిడికిట్లోవున్న పాము వైపు చూడాలన్నా భయమేసి, దానివైపే చూడదట. అయితే, ఎప్పుడు వదులుతుంది? అని అడక్కు. దాన్తో మనకు అనవసరం. అవసరమేమిటంటే, మనం ఉద్యోగాల్ని ఆ విధంగా వదలకుండా పట్టుకుని కూచుంటామని తెలుసుకోవడం. వదిల్తే, అది మన జీవితాన్ని కాటువేస్తుందని భయపడి ఏ స్థితిలో వున్న దాన్నయినా పట్టుకుని వుంటాం."

"కోతి పామును ఆవిధంగా పట్టుకుంటుందన్నది నిజమా?"

"నిజమో, కాదో దాన్ని గురించి కాదు, అది మన పరిస్థితికి సరైన పోలికేనా, కాదా, దాన్నిగురించి ఆలోచించు"

"విచిత్రంగా వుంది...."

"అందులో విచిత్రమేవుంది. ఇందులో విషాదముంది. కోతి చేతిలో చచ్చిన పాము కాటు వెయ్యలేదు. కానీ చచ్చిన ఉద్యోగం కాటువేస్తుంది. ఆ విషం దిగిన వాడిలో జీవచైతన్యం హరించి, సమాజంలో ఇతరుల మాదిరి వయోధర్మంగా క్రమంగా కాక, అక్రమంగా అకాలవృద్ధుడైపోతాడు. అది ఉద్యోగవిషవిషాదం."

* * *

ఈ రోజు వెంకట్రామయ్య "రిటైరయ్యాక ఏం చేస్తార్లెండి" అనడం చూస్తే, ఆ రోజు కోటేశ్వరరావు చెప్పిన పోలిక కానీ, చేసిన విశ్లేషణ కానీ కరెక్టుగానే వుంది... అనుకోకుండా వుండలేకపోయాను.